# విశాల భారతి

తెలుగు దినపత్రిక

25-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 80


## తెలంగాణలో 30 దాకా వానలు

ఈ నెలాఖరు వరకు తెలంగాణలో ఉరుములు, మెరుపులు
పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసే అవకాశం
రెండు రోజులు తగ్గుముఖం, ఆపై పెరిగే ఛాన్స్
బుధ, గురువారాల్లో బలమైన గాలులతో కూడిన వానలు
శుక్రవారం హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో వర్ష సూచన
శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా వానలు

03



# తెలంగాణకు నేనే హీరో

## దక్షిణాది రాష్ట్రాలపై ప్రధానికి చిన్నచూపు ఉందని రేవంత్ ఆరోపణ

- టాప్-10 కేంద్ర శాఖల్లో దక్షిణాది వారికి చోటు లేదని విమర్శ
- సీట్ల పెంపులో సౌత్ రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని వెల్లడి
- వివక్షకు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకం కావాలని పిలుపు
- జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే ఉత్తరాదికే లాభమని విశ్లేషణ
- తెలంగాణలో మరో 8 ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని స్పష్టీకరణ



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి చిన్నచూపు ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఒక ప్రైవేట్ టీవీ ఛానల్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. దేశ రాజకీయాల్లో దక్షిణాది పాత్రను తక్కువ చేస్తున్నారని విమర్శించారు. కీలకమైన శాఖల కేటాయింపులో దక్షిణాది నేతలకు అన్యాయం జరుగుతోందని దుయ్యబట్టారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మినహా, టాప్ 10 శాఖల్లో దక్షిణాది వారు ఎవరూ లేకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర కేబినెట్‌లో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో దక్షిణాది నుంచి వచ్చిన వారికి అత్యున్నత గౌరవం లభించేదని రేవంత్ గుర్తు చేశారు. గతంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి రాష్ట్రపతి పదవులను అధిష్టించిన వారు ఉన్నారని, కానీ బీజేపీ హయాంలో అలాంటి పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. కీలక నిర్ణయాలు తీసుకునే క్రమంలో కేవలం ఉత్తరాది

మిగతా 3లో..

### జనజీవన స్రవంతిలోకి

# నక్సల్ అగ్రనేత

- 40 ఏళ్ల తర్వాత పాపారావు జనజీవన స్రవంతిలోకి
- పాపారావుతో పాటు మరో 17 మంది నక్సల్స్ లొంగుబాటు
- ప్రజాస్వామ్య పద్ధతిలోనే పోరాడుతానని వెల్లడి
- మార్చి 31లోపు నక్సల్స్ రహిత రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్
- 30 కమిటీల నుండి కేవలం 4కు పడిపోయిన నక్సల్స్
- నక్సలిజం అంతమైనా కొనసాగనున్న పోలీసు బలగాల నిఘా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో దశాబ్దాలుగా వినిపిస్తున్న తుపాకీ మోత ఆగిపోయే సమయం ఆసన్నమైంది. నాలుగు దశాబ్దాలుగా సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీలో అత్యంత కీలక నేతగా ఎదిగిన పాపారావు అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. తనతో పాటు 17 మంది సహచరులను వెంటేసుకుని అడవిని వీడి బయటకు వచ్చారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక వ్యక్తి లొంగుబాటు కాదు, ఒక సుదీర్ఘ పోరాట ముగింపునకు నాందిగా విశ్లేషకులు భావిస్తున్నారు. భద్రతా బలగాలకు ఇది ఒక చారిత్రాత్మక విజయమని చెప్పక తప్పదు. మావోయిస్టుల అడ్డాగా పేరుగాంచిన నేషనల్ పార్క్ ఏరియాలో పాపారావు తిరుగులేని నేతగా ఉండేవారు.

మిగతా 3లో..



## క్రైస్తవ ఎస్సీలకు షాక్!



- క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవు
- మతం మారిన వారికి ఈ చట్టం కింద రక్షణ ఉండదు
- కేవలం హిందూ, సిక్కు, బౌద్ధులే ఎస్సీలుగా గుర్తింపు
- క్రైస్తవంలో కుల వ్యవస్థ లేదు, అందుకే ఎస్సీ హోదా చెల్లదు
- మతం మారాక పాత కుల ధృవీకరణ పత్రం వాడటం చట్టవిరుద్ధం
- పాత మతంలోకి వస్తేనే హోదా పునరుద్ధరణకు అవకాశం

02

## గ్యారెంటీలకు బడ్జెట్ సమాధి!



- బడ్జెట్ అంకెలన్నీ అవాస్తవం, భరోసా లేదని విమర్శ
- అంచనాలకు, ఖర్చులకు రూ. 50 వేల కోట్ల తేడా
- రుణమాఫీ, బోనస్ హామీల అమలులో విఫలం
- పాత సంక్షేమ పథకాలను నిలిపివేశారని ఆరోపణ
- ఆదాయం తగ్గి, అప్పులు భారీగా పెరిగాయని మండిపాటు
- రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటు పడిపోయిందని ధ్వజం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ అంకెల గారడీ తప్ప సామాన్యుడికి కలిగే ప్రయోజనం ఏమీ లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కేటాయింపులు జరగలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో స్పష్టత కరువైందని, భరోసా ఇచ్చే అంశాలు ఒక్కటి కూడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా

మిగతా 3లో..



### తెలంగాణ భవిష్యత్తు

## ఫ్యూచర్ సిటీ

- హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మారుస్తామన్న ప్రభుత్వం
- రూ. 16 వేల కోట్ల విలువైన పనుల ప్రణాళికలు సిద్ధం
- పనులు ప్రకటనలకే పరిమితం, నిధులు ఖర్చు చేయట్లేదని ధ్వజం
- వచ్చే ఏడాదిలో రూ. 2,250 కోట్లు ఖర్చు చేస్తామని వెల్లడి
- శిలాఫలకాలపై ఓడిపోయిన వారి పేర్లు వేస్తున్నారని విపక్షం ఫైర్

02

### ప్రజల పక్షాన నిలబడేదే

## ప్రజాస్వామ్యం

- బీఆర్ఎస్‌పై భట్టి విక్రమార్క ఘాటు విమర్శలు
- "సభలో వినే ఓపిక లేదు.. అహంకారం ఎక్కువ"
- ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ప్రమాద భీమా
- రైతులు, విద్యార్థుల కోసం కీలక పథకాలు



06



## మోదీ–ట్రంప్ ఫోన్ కాల్

- పశ్చిమాసియా శాంతిపై కీలక చర్చలు
- ఈ మార్గాన్ని తెరిచి ఉంచడం అత్యవసరమని వెల్లడి
- ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ సహకారం
- మహమ్మద్ బఖేర్ నియామకం
- ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ కీలక నేత హతం
- ఇరాన్ రాయబారిని దేశం విడిచి వెళ్లాలని ఆదేశం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ అంతర్జాతీయ వేదికపై పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య మొదలైన వైరం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే ప్రమాదం నెలకొంది. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగారు. తాజాగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేసి సుదీర్ఘంగా చర్చలు జరపడం దౌత్య వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కీలక సంభాషణలో హార్మూజ్ జలసంధి రక్షణ, ప్రాంతీయ సుస్థిరత ప్రధాన అజెండాగా నిలిచాయి. భారతదేశం ఎప్పుడూ

మిగతా 3లో..

# ఏ-1గా కేటీఆర్

- ఏసీబీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో కేటీఆర్ ప్రధాన నిందితుడు
- రూ. 55 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు బదిలీ
- ఐఏఎస్ అధికారులపై ఒత్తిడి తెచ్చి నిధులు విడుదల
- బీఆర్ఎస్ పార్టీకి రూ. 45 కోట్ల బాండ్లు అందాయి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగింది
- న్యాయపోరాటం చేస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు

02




### ఈ రేస్ కేసు ముమ్మాటికీ

## లొట్టపీసు కేసే

- ఫార్ములా-ఈ రేస్ కేసులో అవినీతి లేదు, ఇదంతా అబద్ధం
- నిర్ణయాలన్నీ నావే, అధికారులను కాక నన్ను విచారించండి
- మూసీ టీడీఆర్ లలో ఇన్ సైడర్ ట్రేడింగ్ జరుగుతోంది
- దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో అన్యాయం జరగొద్దు
- ఆరు గ్యారెంటీల నుండి దృష్టి మళ్లించడానికే ఈ కేసులు
- అందరం కలిశాము కానీ, వ్యక్తిగత భేటీలు ఏమీ లేవు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన ఫార్ములా-ఈ రేస్ నిధుల విడుదల వ్యవహారంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ తనదైన శైలిలో స్పందించారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన, ఈ కేసును పూర్తిగా 'లొట్టపీసు కేసు'గా అభివర్ణించారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదని, ఒకవేళ విచారణ జరపాలనుకుంటే తనపైనే జరపాలని, అనవసరంగా అధికారులను వేధించవద్దని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ

మిగతా 2లో..

# ఈ రేస్ కేసు ముమ్మాటికీ లొట్టపీసు కేసే

**మొదటిపేజీ తరువాయి**

ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలు నిలదీస్తున్నారని, ముఖ్యంగా ప్రైవేట్ మెంబర్ బిల్లు వంటి కీలక అంశాల నుండి తప్పించుకోవడానికే ఫార్ములాఈ రేస్ అంశాన్ని తెరపైకి తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ఈ కేసులో ఎక్కడా క్విడ్ ప్రో కో జరగలేదని, ప్రతి పైసా బ్యాంక్ ద్వారానే బదిలీ అయిందని ఆయన స్పష్టం చేశారు. ఛార్జ్ షీట్‌లో సంబంధిత కంపెనీ పేరు లేకపోవడాన్ని ఆయన ఎత్తి చూపుతూ, కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే ఈ తతంగం నడుస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఈ రేస్ వల్ల నగరానికి రూ. 700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారనే ఆరోపణలపై స్పందిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును కేటీఆర్ తప్పుపట్టారు. మెస్సీతో ఫుట్‌బాల్ ఆటకు వంద కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఆ నిధులను సీఎం నుండి రికవరీ చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. అలాగే, రూ. 200 కోట్లు ఖర్చు చేసి నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీలు ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లా మ్యాగీ ఇంటర్వ్యూలో వెల్లడైన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎందుకు విచారణ జరపడం లేదని ఆయన నిలదీశారు. తప్పుడు కేసులకు తాము భయపడబోమని, న్యాయస్థానాల్లో తమకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో టీడీఆర్ జారీలో భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు టీడీఆర్‌లను ఒక ఏటీఎంలా వాడుకుంటున్నారని, ఇది స్పష్టంగా ఇన్ సైడర్ ట్రేడింగ్ అని ఆయన మండిపడ్డారు. కృత్రిమ డిమాండ్ సృష్టించి టీడీఆర్‌ల ద్వారా వందల కోట్లు కొల్లగొడుతున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. మూసీ బాధితులకు కేవలం టీడీఆర్‌లు ఇచ్చి సరిపెట్టాలని చూడటం వారిని మోసం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. మూసీ నది ప్రక్షాళన, బాధితుల పునరావాసంపై చర్చను పెద్ద కాంట్రాక్టర్ల ఆఫీసుల్లో కాకుండా నేరుగా ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవేళ ముఖ్యమంత్రికి భయం ఉంటే వెయ్యి మంది పోలీసులను రక్షణగా పెట్టుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. సామాన్యుల ఇళ్లను కూల్చివేస్తూ, మరోవైపు టీడీఆర్ స్కామ్‌లతో రియల్ ఎస్టేట్ మాఫియాకు కొమ్ముకాస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలను ఎండగడతామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరగడాన్ని తాము స్వాగతిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఏపీ విభజన చట్టంలోనే ఈ హామీ ఉందని, ఇప్పటికే దీని అమలులో జాప్యం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచే క్రమంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో దక్షిణాదికి ఉన్న 24 శాతం ప్రాతినిధ్యాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఎక్కువ నియోజకవర్గాలు ఉండటం వల్ల ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రజాప్రతినిధులకు మరింత మెరుగ్గా లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

డీలిమిటేషన్ అంశంలో ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేకూర్చి, దక్షిణాదిని శిక్షించే విధంగా నిర్ణయాలు ఉండకూడదని కేటీఆర్ హితవు పలికారు. దక్షిణాది రాష్ట్రాలు బాధ్యతాయుతంగా కుటుంబ నియంత్రణ పాటించాయని, దానికి ప్రతిఫలంగా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం సరికాదని పేర్కొన్నారు. "కుటుంబ నియంత్రణ పాటించని వారికి నజరానా.. పాటించిన వారికి జరిమానా" అనే పద్ధతి సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి పొరపాటు చేయదని భావిస్తున్నానని, ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

మహిళా సంఘాలకు రూ. 57 వేల కోట్ల వడ్డీ లేని రుణాల విషయంలో మంత్రి సీతక్క అవాస్తవాలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేసిన కృషిని తక్కువ చేసి చూపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఈ విషయంలో తనపై సీతక్క లేదా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బహిరంగ చర్చకు రావాలని, అబద్ధాలు నిరూపితమైతే వారు రాజీనామా చేస్తారా అని సవాల్ విసిరారు. అధికారులను ఇబ్బంది పెట్టే బదులు, చేతనైతే తనపై నేరుగా చర్యలు తీసుకోవాలని ఆయన సవాల్ చేశారు. మహిళలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు కాలం చెల్లిందని ఆయన హెచ్చరించారు. ఇటీవల కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డితో తాను భేటీ అయినట్లు వస్తున్న వార్తలపై కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు. తాను రాజగోపాల్ రెడ్డితో వ్యక్తిగతంగా లేదా ఒంటరిగా కూర్చోలేదని, అసెంబ్లీ లాబీల్లో ఏడెనిమిది మంది ఎమ్మెల్యేలతో కలిసి సరదాగా సంభాషించామని తెలిపారు. రాజకీయాల్లో ప్రత్యర్థులమైనప్పటికీ వ్యక్తిగత గౌరవ మర్యాదలు ఉంటాయని, ఆ సమయంలో వివిధ అంశాలపై హాస్యాస్పదంగా చర్చించుకున్నామని చెప్పారు. దీనికి రాజకీయ రంగు పులమాల్సిన అవసరం లేదని, ప్రజా సమస్యలపై పోరాటంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, విచారణల పేరుతో వేధించినా తాము వెనక్కి తగ్గబోమని కేటీఆర్ పునరుద్ఘాటించారు. తాము చేసిన ప్రతి పని పారదర్శకంగా జరిగిందని, అభివృద్ధి లక్ష్యంగానే నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కాలమే అన్ని నిజాలను బయటపెడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోసం గత ప్రభుత్వం చేసిన పనులను చెరిపేయాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజకీయ వేధింపులను ధీటుగా ఎదుర్కొంటామని కేటీఆర్ ఈ సందర్భంగా కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం, హైదరాబాద్ అంతర్జాతీయ ఖ్యాతి కోసం తాము నిరంతరం కృషి చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములాఈ రేస్ వంటి అంతర్జాతీయ ఈవెంట్లు నగరం యొక్క బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతాయని, అటువంటి వాటిపై రాజకీయాలు చేయడం దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ, విపక్షంగా తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూనే, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని కేటీఆర్ తన చిట్‌చాట్‌ను ముగించారు.

## ఏ-1గా కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ యవనికపై ఫార్ములాఈ కార్ రేసు వ్యవహారం ఒక్కసారిగా పెను తుపానును సృష్టించింది. గత ప్రభుత్వ హయాంలో భాగ్యనగర వేదికగా జరిగిన ఈ అంతర్జాతీయ క్రీడా ఈవెంట్ చుట్టూ అల్లుకున్న అవినీతి ఉచ్చు ఇప్పుడు మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను చుట్టుముట్టింది. ఈ కేసుకు సంబంధించి సుదీర్ఘ కాలంగా దర్యాప్తు సాగించిన అవినీతి నిరోధక శాఖ కీలక ఆధారాలను సేకరించి నాంపల్లి కోర్టులో సమగ్రమైన ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఇందులో కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా చేర్చడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనానికి దారితీసింది. పారదర్శకతకు మారుపేరుగా చెప్పుకునే పాలనలో తెర వెనుక జరిగిన లోతైన లావాదేవీలను ఏసీబీ తన నివేదికలో బట్టబయలు చేసింది. హుస్సేన్‌సాగర్ తీరాన మెరుపు వేగంతో దూసుకెళ్లిన రేసింగ్ కార్ల వెనుక ప్రభుత్వ నిధుల మళ్లింపు ఉందన్న ఆరోపణలు ఇప్పుడు నిజమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి ప్రజా ధనాన్ని విదేశీ సంస్థలకు అప్పనంగా కట్టబెట్టారన్నది ఏసీబీ ప్రధాన వాదనగా కనిపిస్తోంది. మొత్తం రూ. 55 కోట్ల భారీ మొత్తాన్ని ఫార్ములాఈ ఆపరేషన్స్ సంస్థకు తరలించడంలో ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందని అధికారులు గుర్తించారు. ఈ నిధుల విడుదల ప్రక్రియలో కనీస నిబంధనలను పాటించలేదని, ఆర్థిక శాఖ నుంచి రావాల్సిన ముందస్తు అనుమతులను కూడా విస్మరించారని ఛార్జిషీట్ పేర్కొంటోంది. అధికార యంత్రాంగాన్ని ప్రభావితం చేసి ఈ నిధులను దారి మళ్లించిన తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో నేరపూరిత కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తోందని దర్యాప్తు సంస్థ నొక్కి చెబుతోంది. అప్పటి పురపాలక శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ నేరుగా ఆదేశాలు జారీ చేయడం వల్లే నిధుల విడుదల వేగవంతమైందని ఏసీబీ వివరించింది. ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఈ నిధులను ఎఫ్‌ఈవో ఖాతాకు బదిలీ చేయడంలో కీలక పాత్ర పోషించారని, ఆయన కేవలం పైస్థాయి ఒత్తిడి మేరకే వ్యవహరించారని నివేదిక స్పష్టం చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన విదేశీ మారక ద్రవ్య నిబంధనలను సైతం బేఖాతరు చేస్తూ ఈ చెల్లింపులు జరగడం చట్టవిరుద్ధమని అధికారులు కోర్టుకు విన్నవించారు. అవినీతి నిరోధక శాఖ సమర్పించిన పత్రాల్లో క్విడ్ ప్రో కో అంశం అత్యంత కీలకంగా మారింది. ప్రభుత్వ నిధులను విదేశీ సంస్థకు మళ్లించినందుకు ప్రతిఫలంగా ఒక భారీ ఒప్పందం కుదిరిందని ఏసీబీ అనుమానిస్తోంది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ. 45 కోట్లు అందాయని ఛార్జిషీట్‌లో పేర్కొనడం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఒక ప్రైవేట్ ఈవెంట్ కోసం ప్రభుత్వ ఖజానాను వాడుకోవడం, దానికి బదులుగా పార్టీ నిధులను సమకూర్చుకోవడం వంటి అంశాలు తీవ్రమైన నేరాల కిందకు వస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆర్థిక మూలాలను వెలికితీయడంలో ఏసీబీ పకడ్బందీగా వ్యవహరించింది. కేవలం రాష్ట్ర స్థాయి దర్యాప్తు సంస్థలతోనే కాకుండా, ఈ కేసు ఇప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థల పరిధిలోకి కూడా వెళ్లడం గమనార్హం. నిధుల మళ్లింపు వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. ఏసీబీ ఛార్జిషీట్‌ను ప్రాతిపదికగా తీసుకుని ఈడీ తనదైన శైలిలో విచారణను వేగవంతం చేస్తోంది. విదేశీ సంస్థలకు నిధులు వెళ్లిన మార్గాలను, ఆ నిధులు తిరిగి ఏ రూపంలో రాష్ట్రానికి వచ్చాయనే కోణంలో లోతైన శోధన జరుగుతోంది. దీనివల్ల కేటీఆర్‌తో పాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరు కీలక నేతలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. మరోవైపు ఈ పరిణామాలపై రాజకీయ రణరంగం వేడెక్కింది. ప్రభుత్వం కావాలనే తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి, నగరాన్ని అంతర్జాతీయ పటంలో నిలబెట్టడానికి చేసిన ప్రయత్నాన్ని తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆయన వాదిస్తున్నారు. క్రీడల నిర్వహణలో సహజంగా జరిగే ఒప్పందాలను అవినీతిగా చూడటం సరికాదని, చట్టపరంగా ఈ పోరాటాన్ని ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే ప్రస్తుత ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని వేధిస్తోందని ఆయన మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా కేటీఆర్‌ను పేర్కొనడం వెనుక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయని ప్రభుత్వం తరపు న్యాయవాదులు చెబుతున్నారు. అధికారిక ఫైళ్లపై ఉన్న సంతకాలు, వాట్సాప్ చాట్లు, ఈమెయిల్ సంభాషణలు అన్నీ కూడా నేర నిరూపణకు దోహదం చేస్తాయని ఏసీబీ ధీమాగా ఉంది. నిధుల మళ్లింపు కోసం రూపొందించిన అగ్రిమెంట్లలో ఉన్న లొసుగులను అధికారులు ఒక్కొక్కటిగా బయటపెడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగంపై మంత్రి హోదాలో కేటీఆర్ సాగించిన పెత్తనం వల్లనే వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఛార్జిషీట్ సారాంశం చెబుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలక పక్ష నేతలు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా ఉన్న కేటీఆర్ చుట్టూ ఇటువంటి కేసు బిగుసుకోవడం పార్టీ శ్రేణుల్లో కలవరం కలిగిస్తోంది. ఒకప్పుడు అభివృద్ధికి చిరునామాగా నిలిచిన ఫార్ములాఈ రేసు ఇప్పుడు అవినీతి మరకలను అంటించుకుంది. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ కార్ల రేసింగ్ ద్వారా ప్రపంచాన్ని ఆకర్షించాలనుకున్న లక్ష్యం పక్కకుపోయి, కోర్టు మెట్లెక్కాల్సిన పరిస్థితి రావడం విచారకరం. ఈ కేసులో సాక్షులుగా ఉన్న ఐఏఎస్ అధికారుల వాంగ్మూలాలు నిందితులకు మరింత సంకటంగా మారే అవకాశం ఉంది. పాలనలో పారదర్శకత లోపిస్తే ఎంతటి వారికైనా ఇబ్బందులు తప్పవని ఈ ఉదంతం హెచ్చరిస్తోంది. ఛార్జిషీట్‌లో పేర్కొన్న అంశాలు ప్రాథమికంగా కేటీఆర్ ప్రమేయాన్ని ధ్రువీకరిస్తున్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా విదేశీ చెల్లింపుల విషయంలో అనుసరించిన గోప్యత అనేక అనుమానాలకు తావిస్తోంది.



# క్రైస్తవ ఎస్సీలకు షాక్!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సుప్రీంకోర్టు తాజాగా వెలువరించిన ఒక సంచలన తీర్పు దేశవ్యాప్తంగా పెను సంచలనాన్ని సృష్టిస్తోంది. ముఖ్యంగా మత మార్పిడి చేసుకున్న షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలపై ఈ తీర్పు ఒక స్పష్టమైన గీత గీసింది. క్రైస్తవ మతంలోకి మారిన వ్యక్తులు ఎస్సీలకు లభించే రాజ్యాంగపరమైన హక్కులను, ప్రత్యేకించి ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద రక్షణను పొందలేరని అత్యున్నత న్యాయస్థానం కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. ఈ తీర్పుతో ఏళ్ల తరబడి సాగుతున్న మతంకులం మధ్య ఉన్న న్యాయపరమైన చిక్కుముడి వీడిపోయినట్లయింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ అంజరియా ధర్మాసనం ఈ కీలక ఉత్తర్వులను జారీ చేసింది. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే, క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక వ్యక్తి, తనకు ఎస్సీ సర్టిఫికేట్ ఉందని, తద్వారా అట్రాసిటీ చట్టం కింద రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఒక వ్యక్తి తన ఇష్టప్రకారం మతాన్ని మార్చుకున్నప్పుడు, ఆ మతంలో ఉన్న నియమ నిబంధనలకు కట్టుబడి ఉండాలని కోర్టు అభిప్రాయపడింది. క్రైస్తవ మతంలో అధికారికంగా కుల వ్యవస్థ లేదని, అందువల్ల ఎస్సీ హోదాను అక్కడ కొనసాగించడం సాధ్యం కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. కేవలం ఎస్సీ సర్టిఫికేట్ చేతిలో ఉన్నంత మాత్రాన చట్టపరమైన రక్షణలు వాటంతట అవే వర్తించవని ఈ సందర్భంగా ధర్మాసనం ఘంటాపథంగా చెప్పింది.

రాజ్యాంగంలోని 1950 షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వును కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ నిబంధన ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారు మాత్రమే ఎస్సీలుగా గుర్తింపు పొందేందుకు అర్హులని వివరించింది. ఈ మూడు మతాలు మినహా మరే ఇతర మతంలోకి మారినా, సదరు వ్యక్తి తన పుట్టుకతో వచ్చిన ఎస్సీ హోదాను కోల్పోతారని కోర్టు స్పష్టంగా పేర్కొంది. మతం మారిన వెంటనే సామాజిక హోదాలో మార్పు వస్తుందని, తద్వారా ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు పొందడం రాజ్యాంగ విరుద్ధమని తీర్పులో వెల్లడించింది. దీనివల్ల క్రైస్తవ లేదా ఇస్లాం మతాల్లోకి మారిన ఎస్సీలకు ఇకపై ఎస్సీ కోటా కింద ప్రయోజనాలు అందవని అర్థమవుతోంది.

ప్రస్తుత జనరేషన్ యువతకు ఈ తీర్పు ఒక పెద్ద పాఠంగా నిలుస్తోంది. హక్కులు, బాధ్యతల మధ్య ఉండే సమతుల్యతను ఇది గుర్తు చేస్తోంది. ఒక వ్యక్తి తన విశ్వాసాన్ని మార్చుకున్నప్పుడు, ఆ మతానికి సంబంధించిన సామాజిక స్థితిగతులను కూడా స్వీకరించాల్సి ఉంటుందని కోర్టు సూచించింది. మతం మారినా పాత కుల సర్టిఫికేట్‌ను వాడుకుంటూ లబ్ధి పొందాలనుకోవడం చట్టపరంగా చెల్లదని ఈ తీర్పు హెచ్చరిస్తోంది. కేవలం కాగితాల మీద కులం పేరు ఉన్నంత మాత్రాన, ఆచరణలో మతం మారిన తర్వాత ఆ హక్కులను క్లెయిమ్ చేయడం సాధ్యం కాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే, కోర్టు ఒక చిన్న వెసులుబాటును కూడా ఈ సందర్భంగా చర్చకు తెచ్చింది. ఒకవేళ మతం మారిన వ్యక్తి తిరిగి తన పాత మతంలోకి రావాలని నిర్ణయించుకుంటే, అప్పుడు హోదా పునరుద్ధరణకు అవకాశం ఉంటుందని పేర్కొంది. కానీ, ఇది అంత సులభం కాదని, సదరు వ్యక్తిని అతని పాత కుల సంఘం తిరిగి చేర్చుకున్నట్లు నిరూపించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దశాబ్దాల కాలం పాటు పాస్టర్‌గా పనిచేసిన వ్యక్తి, తను తిరిగి ఎస్సీ కమ్యూనిటీలో భాగమయ్యానని బలమైన సాక్ష్యాధారాలతో నిరూపించుకుంటేనే పాత హోదాను తిరిగి పొందే వీలుంటుందని న్యాయమూర్తులు వివరించారు.



ఈ తీర్పు ప్రభావం ఒక్క ఆంధ్రప్రదేశ్ మీదనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలపైనా పడనుంది. దేశంలో చాలా మంది ఎస్సీలు సామాజిక కారణాలతో లేదా వ్యక్తిగత ఇష్టంతో క్రైస్తవ మతంలోకి మారుతుంటారు. కానీ, రికార్డుల్లో మాత్రం పాత కులాన్నే కొనసాగిస్తూ ప్రభుత్వ పథకాలను, రిజర్వేషన్లను పొందుతున్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో అటువంటి డ్యూయల్ స్టేటస్ కలిగిన వారికి ఇబ్బందులు తప్పవు. మతం మారిన తర్వాత కూడా ఎస్సీ హోదాను వాడుకోవడం ఇకపై చట్టవిరుద్ధమైన చర్యగా పరిగణించబడుతుంది. అట్రాసిటీ చట్టం కింద నమోదయ్యే కేసుల విషయంలో కూడా ఈ తీర్పు ఒక మైలురాయిగా నిలవనుంది. ఎస్సీ, ఎస్టీ చట్టం అనేది ఆయా వర్గాల రక్షణ కోసం రూపొందించబడింది. కానీ, ఒక వ్యక్తి హిందూ ధర్మాన్ని వీడి క్రైస్తవ మతంలోకి మారినప్పుడు, అతను ఆ చట్టం పరిధిలోకి రాడని కోర్టు స్పష్టం చేయడంతో, భవిష్యత్తులో పోలీస్ విచారణల్లో, కోర్టు కేసుల్లో ఈ అంశం కీలక పాత్ర పోషించనుంది. నిందితుడు లేదా ఫిర్యాదుదారు మతపరమైన స్థితిగతులు ఇప్పుడు కేసు గమనాన్ని మార్చవచ్చు. చట్టం దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా ఇది ఒక అడుగు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ తీర్పు రాజ్యాంగబద్ధమైన సమానత్వ సూత్రాన్ని బలపరుస్తోంది. ఒక వ్యక్తికి ఒకే సమయంలో రెండు వేర్వేరు సామాజిక గుర్తింపులు ఉండకూడదని ఇది స్పష్టం చేస్తోంది. మతం అనేది వ్యక్తిగత విశ్వాసం అయినప్పటికీ, దానివల్ల పొందే సామాజిక హోదా మాత్రం చట్టపరమైన నిబంధనలకు లోబడి ఉండాలని కోర్టు భావించింది. దీనివల్ల నిజమైన ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్ ఫలాలు మరింత మెరుగ్గా అందుతాయని, అర్హత లేని వారు పక్కకు తప్పుకుంటారని ప్రభుత్వం వైపు నుంచి కూడా వాదనలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా కూడా ఈ తీర్పు పెనుదుమారాన్ని రేపుతోంది. వివిధ రాజకీయ పార్టీలు, దళిత సంఘాలు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. కొందరు ఈ తీర్పును స్వాగతిస్తుంటే, మరికొందరు మతం మారినంత మాత్రాన సామాజిక వివక్ష పోదని, అందుకే వారికి కూడా ఎస్సీ హోదా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, సుప్రీంకోర్టు మాత్రం సామాజిక వివక్ష కంటే రాజ్యాంగ నిబంధనలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది.

# తెలంగాణ భవిష్యత్తు ఫ్యూచర్ సిటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర శాసనసభ వేదికగా భాగ్యనగర అభివృద్ధిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. నగరంలోని ట్రాఫిక్ కష్టాలు, పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి తరపున మంత్రి శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తామని ఆయన ప్రకటించారు. అయితే మూసీ ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షం అనవసర రాజకీయం చేస్తోందని మంత్రి విమర్శించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారీ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు కింద రూ.7,032 కోట్ల అంచనాతో 26 పనులను గుర్తించామని చెప్పారు. వీటితో పాటు రూ.1,500 కోట్లతో 49 లింక్ రోడ్లు, రూ.7,406 కోట్లతో మూడు కీలక ఎలివేటెడ్ కారిడార్లకు పరిపాలన అనుమతులు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం సుమారు రూ.16 వేల కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ గణాంకాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రూ.16 వేల కోట్ల పనులు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. గడిచిన రెండేళ్లలో కేవలం రూ.122 కోట్లు మాత్రమే ఖర్చు చేయడంపై నిలదీశారు. ఇంత తక్కువ నిధులతో పనులు ఎప్పటికి పూర్తవుతాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా వ్యూహాత్మక రహదారులను నిర్మించి ట్రాఫిక్‌ను 30 నుంచి 40 శాతం తగ్గించామని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమవుతోందని, క్షేత్రస్థాయిలో పనులు స్తంభించిపోయాయని విమర్శించారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఈస్ట్‌వెస్ట్ కారిడార్ అత్యవసరమని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సూచించారు. మూసీ వెంబడి ఈ కారిడార్‌ను అభివృద్ధి చేస్తే నగరంలో రద్దీ గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కేటాయిస్తున్న అరకొర నిధులను చూస్తుంటే.. ఈ ప్రాజెక్టుల పూర్తిని తమ మనవళ్లు చూస్తారేమోనని ఎద్దేవా చేశారు. పనులు వేగవంతం చేయకపోతే భవిష్యత్తులో హైదరాబాద్ ప్రయాణానికి నరకంగా మారుతుందని హెచ్చరించారు. నగరంలోని రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు.



పాత పనులను రద్దు చేస్తూ కొత్త టెండర్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు తమ పేర్లు తగిలించుకోవడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకుందని తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని, కనీసం ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని ధ్వజమెత్తారు. అధికారిక కార్యక్రమాల్లో ఎన్నికల్లో ఓడిపోయిన వారి పేర్లు శిలాఫలకాలపై ఎలా పెడతారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ బాధితుల కోసం ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల విమర్శలను మంత్రి శ్రీధర్ బాబు తోసిపుచ్చారు. గత ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పనిని తాము ఆపలేదని స్పష్టం చేశారు. కేవలం సాంకేతిక కారణాలు, ప్రజా అవసరాల దృష్ట్యా కొన్ని మార్పులు మాత్రమే చేశామని వివరించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ వంటి కీలక పనులను త్వరలోనే వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు. నిధుల ఖర్చు విషయంలో గారడీ చేయడం లేదని, 202627 ఆర్థిక సంవత్సరంలో నగరాభివృద్ధి కోసం రూ.2,250 కోట్లు ఖర్చు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని వివరించారు. హైదరాబాద్ నగరం నలుదిశలా విస్తరిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. మూసీ పునరుజ్జీవం అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, అది నగర ఆత్మ గౌరవమని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ సభ్యులు అడ్డుతగలడం సరికాదని హితవు పలికారు. గత పాలనలో ప్రోటోకాల్ ఉల్లంఘనలు లెక్కలేనన్ని జరిగాయని, తాము మాత్రం అందరినీ కలుపుకుని వెళ్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి నగర ముఖచిత్రం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణకు రావాల్సిన వాటా కోసం రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరారు. హైదరాబాద్ కేవలం తెలంగాణది మాత్రమే కాదని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. కేంద్రం నుంచి సరైన సహకారం అందితే ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. నిధుల కొరత లేకుండా చూసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు.

నగర ఎమ్మెల్యేలతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అందరి సలహాలు తీసుకుని ట్రాఫిక్, మురుగునీటి పారుదల వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. అభివృద్ధి విషయంలో రాజకీయం చేయబోమని, ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూస్తామని చెప్పారు. పాతబస్తీ అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, మెట్రో విస్తరణ పనులు త్వరలో పట్టాలెక్కుతాయని వెల్లడించారు.

వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో గణనీయమైన మార్పులు కనిపిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. సిగ్నల్ ఫ్రీ ప్రయాణం కోసం మరిన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని మంత్రి తెలిపారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. నగర సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

మొత్తానికి అసెంబ్లీ చర్చలో హైదరాబాద్ అభివృద్ధిపై వాడీవేడీ వాదనలు వినిపించాయి. నిధుల కేటాయింపులో జాప్యం జరుగుతోందని ప్రతిపక్షం అంటుంటే.. భారీ ప్రాజెక్టులతో నగరాన్ని ప్రపంచ పటంలో నిలుపుతామని అధికార పక్షం చెబుతోంది. ఏదేమైనా ట్రాఫిక్ నరకం నుంచి తమకు ఎప్పుడు విముక్తి లభిస్తుందా అని నగరవాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజకీయ విమర్శలు పక్కన పెట్టి ప్రాజెక్టులు వేగంగా పూర్తయితేనే మహానగరానికి మహర్దశ పడుతుంది.

## భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన చర్యలు

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** ఈ నెల 27,28 తారీఖులలో భద్రాచలంలో జరగనున్న శ్రీరామనవమి ,పట్టాభిషేక మహోత్సవానికి ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగానే పార్కింగ్ స్థలాలు,కళ్యాణ మంటపం,సెక్టార్లు మరియు లడ్డూ ,తలంబ్రాల కౌంటర్ల వద్దకు భక్తులు సులభంగా కనుగొని అక్కడికి చేరుకునే విధంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక QR కోడ్ ను మరియు ఆన్లైన్ లింకును రూపొందించడం జరిగిందని తెలిపారు. https://ramanavami.4sightai.com/ ఆన్లైన్ లింకు ద్వారా రామనవమి మరియు పట్టాభిషేక మహోత్సవ తేదీలలో భద్రాచలంలో భక్తులు సులభంగా వారు చేరుకోవాల్సిన స్థలాలకు చేరుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా సుమారుగా 2000 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు.కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీసు వారికి సహకరించగలరని కోరారు.అదే విధంగా ఆ రెండు రోజులు పాటు భక్తులకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు వారు విధించే ఆంక్షలకు భద్రాచలం పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మోదీ–ట్రంప్ ఫోన్ కాల్

**మొదటిపేజీ తరువాయి**

శాంతిని కోరుకుంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. యుద్ధం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ట్రంప్‌కు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రపంచానికి చమురు సరఫరా చేసే హర్మూజ్ జలసంధి మూతపడకుండా చూడటం అత్యవసరమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ జలసంధిపై ఏ చిన్న ఆటంకం కలిగినా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతాయని, అది సామాన్యులపై పెను భారాన్ని మోపుతుందని భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికా రాయబారి సెర్గియా గోర్ ఈ ఫోన్ కాల్ వివరాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అగ్రరాజ్యం తన వ్యూహాల్లో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా చూస్తోందని ఈ చర్చల ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఇరాన్ తన దూకుడును పెంచిన నేపథ్యంలో, ఆసియా ఖండంలో పట్టున్న భారత్ వంటి దేశాల సహకారం ట్రంప్‌కు ఎంతో అవసరం. శాంతి స్థాపన కోసం భారత్ తన వంతు సహకారాన్ని అందిస్తుందని, అయితే అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలని మోదీ స్పష్టం చేయడం విశేషం.



మరోవైపు ఇరాన్‌లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల ధాటికి ఆ దేశ సైనిక నాయకత్వం చిన్నాభిన్నమవుతోంది. అత్యంత శక్తిమంతమైన నేతగా పేరున్న అలీ లారిజానీ మరణం ఇరాన్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ పక్కా నిఘాతో లారిజానీని అంతమొందించింది. ఈ పరిణామంతో ఖంగుతిన్న టెహ్రాన్ ప్రభుత్వం, వెంటనే మహమ్మద్ బఘేర్ జోల్ఘదర్‌ను కొత్త సెక్యూరిటీ చీఫ్‌గా నియమించింది. బఘేర్ గతంలో రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌లో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉన్న వ్యక్తి. లారిజానీని మట్టుబెట్టేందుకు ఇజ్రాయెల్ భారీ వ్యూహాన్నే రచించింది. సుప్రీం లీడర్ ఖమేనీ మరణానంతరం ఆయన ఇజ్రాయెల్‌కు ప్రధాన లక్ష్యంగా మారారు. శత్రువుల కళ్లు గప్పడంలో దిట్ట అయిన లారిజానీ, యుద్ధం మొదలైనప్పటి నుంచి రహస్య స్థావరాల నుంచే సైన్యాన్ని నడిపించారు. నిరంతరం లోకేషన్లు మారుస్తూ ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్‌కు సవాల్ విసిరారు. అయితే, టెక్నాలజీ సాయంతో ఇజ్రాయెల్ ఆయన కదలికలను ట్రాక్ చేసింది. చివరకు తన కుమార్తె ఇంట్లో ఉన్న సమయంలో జరిగిన వైమానిక దాడుల్లో ఆయనతో పాటు తన కుమారుడు కూడా ప్రాణాలు కోల్పోయారు.

ఇదిలా ఉండగా, లెబనాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇరాన్‌కు పెద్ద షాక్ ఇచ్చింది. తమ దేశంలోని ఇరాన్ రాయబారిని వెంటనే వెళ్ళిపోవాలని లెబనాన్ ఆదేశించింది. అతడిని 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించడం ద్వారా దౌత్యపరమైన సంబంధాల్లో తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ఆదివారం లోగా దేశం విడిచి వెళ్లాలని గడువు విధించింది. ఇరాన్ ప్రమేయం వల్ల తమ దేశం అనవసరంగా యుద్ధంలోకి నెట్టబడుతోందని లెబనాన్ భావిస్తోంది. ఈ నిర్ణయం పశ్చిమాసియాలోని సమీకరణాలను పూర్తిగా మార్చేసేలా ఉంది.

హర్మూజ్ జలసంధి అంశం ఇప్పుడు ప్రపంచ దేశాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇది కేవలం ఒక సముద్ర మార్గం కాదు, ప్రపంచ వాణిజ్యానికి వెన్నెముక వంటిది. ఒకవేళ ఇరాన్ ఈ మార్గాన్ని మూసివేస్తే, రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. అందుకే మోదీ-ట్రంప్ చర్చల్లో ఈ అంశానికి అధిక ప్రాధాన్యం లభించింది. శాంతియుత చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం కావాలని, బలప్రయోగానికి చోటు ఉండకూడదని భారత్ బలంగా వినిపిస్తోంది. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే చర్యలను ఏ దేశమూ సమర్థించదని మోదీ స్పష్టం చేశారు.

పశ్చిమాసియాలో ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్ తన రక్షణ కోసం దాడులను ముమ్మరం చేస్తుంటే, ఇరాన్ తన అస్తిత్వం కోసం పోరాడుతోంది. ఈ ఇద్దరి మధ్య పోరులో చిన్న చిన్న దేశాలు బలిపశువులవుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికా జోక్యం చేసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దాడులు ఆగడం లేదు. ఇలాంటి సమయంలో భారత్ వంటి తటస్థ దేశాల మధ్యవర్తిత్వం చాలా కీలకం కానుంది.

ఇరాన్ కొత్త సెక్యూరిటీ చీఫ్ బఘేర్ రాకతో ఆ దేశ సైనిక వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది. లారిజానీ స్థానాన్ని భర్తీ చేయడం ఆయనకు పెద్ద సవాలే. ఇజ్రాయెల్ వ్యూహాలను ఎదుర్కోవడం, దెబ్బతిన్న సైనిక మనోస్థైర్యాన్ని పెంపొందించడం ఆయన ముందున్న లక్ష్యాలు. అయితే, అంతర్జాతీయంగా పెరుగుతున్న ఒత్తిడి, మరోపక్క దౌత్యపరంగా ఎదురవుతున్న అవమానాలు ఇరాన్‌ను ఇరకాటంలో పడేస్తున్నాయి. దేశం ఆర్థికంగా కూడా చితికిపోతున్న తరుణంలో ఈ కొత్త మార్పులు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాలి. ట్రంప్ తన రెండో విడత పాలనలో విదేశీ విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా యుద్ధాలను ఆపి, అమెరికా ప్రయోజనాలను కాపాడుకోవడంపై ఆయన దృష్టి పెట్టారు. మోదీతో ఉన్న స్నేహాన్ని ఉపయోగించుకుని ఆసియాలో శాంతిని నెలకొల్పాలని ఆయన భావిస్తున్నారు. ఈ ఇద్దరు ప్రపంచ నేతల కలయిక పశ్చిమాసియాలో శాంతికి బాటలు వేస్తుందని ఆశించవచ్చు. దౌత్య మార్గాల్లో చర్చలు జరిగితేనే రక్తపాతం ఆగుతుందని, లేదంటే వినాశనం తప్పదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి పశ్చిమాసియా పరిణామాలు గంటగంటకూ మారిపోతున్నాయి. ఇటు దౌత్య చర్చలు, అటు వైమానిక దాడులతో వాతావరణం నిప్పుల కొలిమిలా మారింది. భారత్, అమెరికా దేశాల ఉమ్మడి ప్రయత్నాలు ఫలిస్తాయా? ఇరాన్ తన పంథాను మార్చుకుంటుందా? లెబనాన్ వంటి దేశాల తిరుగుబాటు ఎలాంటి ఫలితాలను ఇస్తుంది? అనే ప్రశ్నలకు రాబోయే రోజుల్లో సమాధానం దొరకనుంది. ప్రస్తుతానికి మాత్రం ప్రపంచం మొత్తం శాంతి కోసం ఎదురుచూస్తోంది. ఈ పోరు ఆగకపోతే మానవాళికి తీరని నష్టం వాటిల్లడం ఖాయం.

# తెలంగాణలో 30 దాకా వానలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండల తీవ్రతతో అల్లాడుతున్న జనానికి ఉపశమనం కలిగించే వార్తతో పాటు ఆందోళన కలిగించే హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసింది. ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలు పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల సామాన్య ప్రజానీకంతో పాటు రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే ఒకటి నుంచి రెండు డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. మేఘావృతమైన వాతావరణం వల్ల ఎండ వేడి నుంచి తాత్కాలికంగా ఉపశమనం లభించినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితి మారనుంది. నాలుగు రోజుల తర్వాత మళ్లీ ఎండల తీవ్రత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అకస్మాత్తుగా మారే ఈ వాతావరణ పరిస్థితుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. మంగళవారం నుంచి వర్షాల ప్రభావం ప్రారంభం కానుంది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ వంటి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడవచ్చు. అలాగే నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ ప్రాంతాల్లోనూ వర్ష సూచన ఉంది. కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మేఘావృతమై ఉండి, సాయంత్రం వేళల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. పొలాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. బుధవారం నాటికి వర్షాల విస్తృతి మరింత పెరగనుంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాలైన జయశంకర్ భూపాలపల్లి, ములుగుపై వరుణుడు కన్నెర్ర చేయనున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన చినుకులు పడే వీలుంది. అకాల వర్షాల వల్ల మామిడి, మిర్చి సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. గాలి వేగానికి చెట్ల నుంచి కాయలు రాలిపోయే ప్రమాదం ఉందని వారు భయపడుతున్నారు. గురువారం నాడు వాతావరణం మరింత కఠినంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించవచ్చు. ములుగు, కొత్తగూడెం ప్రాంతాల్లో కూడా గాలి వానలు కురిసే అవకాశం ఉంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వాతావరణం చల్లబడనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో అక్కడక్కడా పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి. వర్షం కురిసే సమయంలో చెట్ల కింద గానీ, విద్యుత్ స్తంభాల దగ్గర గానీ నిలబడకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వర్షాల జోరు పతాక స్థాయికి చేరనుంది. దాదాపు మెజారిటీ జిల్లాల్లో వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్ నుంచి మొదలుకొని ఖమ్మం వరకు, నల్గొండ నుంచి మహబూబాబాద్ వరకు వర్ష ప్రభావం ఉంటుంది.



# గ్యారెంటీలకు బడ్జెట్ సమాధి!

**మొదటిపేజీ తరువాయి**

